జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 30 సెప్టెంబర్ 2024
www.ntnews.com




**జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత రూపంలో సమస్త మానవాళికీ ఒక దివ్యమైన బహుమతిని ప్రసాదించాడు. ప్రస్తుత యుగంలో కురుక్షేత్రాన్ని తలపించే మన రోజువారీ జీవితాలకు మార్గనిర్దేశం చేసే దిక్సూచి గీత. ధర్మం క్షీణించి, అధర్మం ప్రబలినపుడల్లా, లోకంలో శాంతి సౌభాగ్యాల కోసం ధర్మాన్ని పునఃస్థాపించడానికి తాను యుగయుగాన అవతరిస్తానని గీతాచార్యుడు ప్రకటించి ఉన్నాడు.**

# ఈ క్షణమే మొదలుపెడదాం

మరి శ్రీకృష్ణుడు ఇప్పుడు ఎక్కడున్నాడు? ప్రపంచంలో నానాటికీ అధర్మం, అశాంతి, నేరాలు, అసంతృప్తి పెరిగిపోవడం మనం చూస్తున్నాం. మరి ఇటువంటి పరిస్థితుల్లో శ్రీ కృష్ణుడు ఎక్కడున్నాడని చాలామంది ప్రశ్నిస్తుంటారు. ఈ క్షణంలోనూ ఆయన మన మధ్యే ఉన్నాడు. మనందరికీ నిత్యం అందుబాటులోనే ఉంటున్నాడు! ప్రస్తుత యుగంలో కృష్ణపరమాత్మ తన పవిత్ర నామ రూపంలో ఈ లోకాన అవతరించాడని శాస్త్రాలు వివరిస్తున్నాయి.

కలికాలే నామ రూపే కృష్ణావతార
నామ హోయితే హయ సర్వ-జగత్-నిస్తార॥

ప్రస్తుత కలియుగంలో భగవంతుడి పవిత్ర నామం, హరేకృష్ణ మహామంత్రమే పరమాత్మ అవతార స్వరూపం. ఆ పవిత్ర నామాన్ని జపించినంత మాత్రాన భగవంతుడితో ప్రత్యక్షానుభూతి లభిస్తుంది. సమస్త కర్మ ఫలాల నుంచి విముక్తి లభిస్తుంది.
(చైతన్య చరితామృతం 17.22)

దోష నిధి అయిన కలియుగానికి ఒక గొప్ప గుణం కూడా ఉంది. అదేమిటంటే.. కృష్ణనామ స్మరణమే!

కలేర్దోషనిధే రాజన్నస్తి హ్యేకో మహాన్గుణః
కీర్తనాదేవ కృష్ణస్య ముక్తసఙ్గః పరం వ్రజేత్
(శ్రీమద్భాగవతం 12.3.51)

రాజా! కలియుగం దోషసాగరమే అయినప్పటికీ దీనిలో ఉన్న ఒక మహాగుణం ఏమంటే.. కేవలం హరేకృష్ణ నామాన్ని కీర్తించడం. ఈ మహామంత్రాన్ని స్మరించడం చేత మనుషులు భవబంధ విముక్తులై పరంధామానికి చేరగలుగుతారు.

శ్రీకృష్ణుడి పవిత్ర నామం ఒక్కటే కలియుగంలో మోక్షానికి గల ఏకైక మార్గమని సమస్త వైదిక శాస్త్రాలూ వివరిస్తున్నాయి.

నామ విను కలికాలే నాహి ఆర ధర్మ
సర్వ మంత్ర సార నామ, ఏయ్ శాస్త్ర మర్మ॥
(చైతన్య చరితామృత, ఆది లీల 7.14)

ప్రస్తుత కలియుగంలో పవిత్ర భగవన్నామ ఉచ్చారణ కన్నా.. గొప్పదైన ధర్మం మరొకటి లేదు. ఇదే సమస్త వైదిక సూక్తుల సారం. సమస్త శాస్త్రాల మర్మం.

ఆ పవిత్ర మహామంత్రం:

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే
హరే రామ హరే రామ రామ రామ హరే హరే

హరేకృష్ణ మహామంత్రంలోని ఈ పదహారు పదాలు ప్రత్యేకంగా కలి కల్మషాలను నిర్మూలిస్తాయి. కలి దోషాల నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఈ పదహారు నామాలు కాకుండా, ఇందుకు ప్రత్యామ్నాయం మరొకటి కనిపించదని భాగవతుల సందేశం. ఈ మహామంత్రాన్ని జాతి, కుల, మత, ప్రాంత, వర్ణ, లింగ, వయో భేదాలేవీ లేక ప్రతిఒక్కరూ జపించవచ్చు. జపించడం అంటే మృదువుగా మంత్రాన్ని ఉచ్చరిస్తూ, భక్తిశ్రద్ధలతో వినడం. ఈ మంత్రం కేవలం మనసులో ఆంతరికంగా జపించేది కాదు. జిహ్వా, పెదాలను కదిలిస్తూ, మంత్రాన్ని ఉచ్చరిస్తూ శ్రద్ధతో వినాలి.



మంత్రాన్ని జపించేటప్పుడు ఉద్దేశపూర్వకంగా ఏ విషయాన్ని గురించి ఆలోచించకూడదు. కేవలం జపిస్తూ మంత్రాన్ని వినాలి. భగవన్నామ శబ్ద ప్రకంపనల్లోనే భగవంతుడు సాక్షాత్కరించి ఉంటాడు. ప్రతిరోజూ నిర్ణీత సంఖ్యలో మంత్రాన్ని జపించాలి. తొలుత చిన్న సంఖ్యతో ప్రారంభించి, క్రమంగా పెంచవచ్చు. ఒక్క మాల అంటే 108 సార్లు జపించాలి. ఆపై జపసంఖ్యను పెంచుతూ నిత్యం 16 మాలలు చేయడం అలవాటుగా చేసుకోవాలి. ఈ ఉత్కృష్టమైన మంత్రాన్ని పఠించడానికి మంచిరోజు కోసమో, సుముహూర్తం కోసమో వేచి చూడాల్సిన అవసరం లేదు. ఆ మంత్రాన్ని పఠించాలనే ఉద్దేశం కలగడమే భగవత్ అనుగ్రహానికి సంకేతం. కాబట్టి, శీఘ్రమే ప్రతి ఒక్కరూ హరేకృష్ణ మంత్రాన్ని జపించండి. ఆనందంగా జీవించండి.

... శ్రీమాన్ సత్యగౌరచంద్రదాస ప్రభూజీ
93969 56984


ఇస్లాం బోధ

## నైతికతే పరమావధి

నైతిక విలువలు లేని విశ్వాసం అసంపూర్ణం. అందుకే .. 'విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి' అంటుంది ఖురాన్. అల్లాహ్ మీద విశ్వాసం ఉంచడంతోపాటు నైతిక విలువలు పాటించడం వల్ల మేలు కలుగుతుంది. కేవలం నమాజ్, రోజా తదితర ఆరాధనలను నిష్ఠగా పాటించి నిత్య జీవితంలో నైతికతను పాటించకపోతే అలాంటివారు స్వర్గ ప్రవేశానికి అర్హులు కారు. ఇతరులను పరుషంగా తిట్టినా, వారి మనసులను గాయపరచినా, తమ స్వార్థం కోసం ఇతరులపై దౌర్జన్యం చేసినా.. అలాంటి వ్యక్తుల పుణ్యఫలాలు బాధితులకు బదిలీ అవుతాయి. ఇలా ఇతరుల మనసు నొప్పించే వ్యక్తి ప్రవక్త(స) దృష్టిలో నిజమైన ముఫ్లిస్ (దరిద్రుడు). నమాజ్, ఉపవాసాల పట్ల శ్రద్ధాసక్తులు చూపుతూ నైతికత కలిగి దానధర్మాలు చేస్తూ, ఇతరుల మనసు గాయపడకుండా నడుచుకునే వారు స్వర్గానికి వెళ్లడానికి అర్హత పొందుతారు. ఇస్లామీయ జీవన విధానంలో, వ్యక్తిత్వ నిర్మాణంలో నైతిక విలువలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అందుకే ఈ విషయాలను ప్రవక్త(స) నిరంతరం బోధనల ద్వారా తన సహచరుల హృదయాల్లో నాటుకొనేలా కృషి చేశారు. విశ్వాసం, సంక్షేమం, నైతికత విడివిడి అంశాలు కావని.. ఈ మూడింటి సమ్మిళిత రూపమే ఇస్లాం అని తెలిపారు. ఆ భావనను తాత్వికంగా, సైద్ధాంతికంగా, భావజాల పరంగా ప్రచారం గావించారు. 'నోరు తెరిస్తే అబద్ధం చెప్పేవాడు, ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చని వాడు, తనకు అమానతుగా ఇచ్చిన దానిని కాజేసేవాడు, ఘర్షణ పడినప్పుడు తిట్టేవాడు కపట స్వభావి' అని ప్రవక్త(స) తెలిపారు.



... ముహమ్మద్ ముజాహిద్
96406 22076



# జితం సర్వం జితేరసే



శుక యోగి పరీక్షిత్తుతో.. రాజా! నందరాజు ఏకాదశీ పుణ్యతిథి దినాన ఉపవసించి ఉపేంద్రుని- విష్ణువుని విధి విధానంగా ఉపాసించాడు. అసురవేళ అని తెలియక వేకువ కాకముందే, ద్వాదశి గడియలు దాటిపోతాయేమోనని ఆకుల- కలవరపడుతూ స్నానానికై వెళ్లి యమునా జలంలో దిగాడు. వెంటనే జలానికి అధిదేవత అయిన వరుణుని దూత నందరాజుని పట్టి బంధించి వరుణ నగరానికి పట్టుకుపోయాడు. తెల్లవారి బృందావనంలో నందుని కానక గోపకులెల్లరూ కలతచెందారు. గ్రద్దన- వేగంగా బలరామకృష్ణులను పెద్దగా కేకలు పెట్టి పిలిచారు. అది వరుణ భృత్యుని మోసపు కృత్యమని గ్రహించి సత్య సంకల్పుడు- నందుని పట్టి కృష్ణుడు అగత్యం- అత్యవసరంగా వరుణలోకానికి వెళ్లాడు. ఆ సమయాన వారి(జల) పతి వరుణదేవుడు తన లోకానికి విచ్చేసిన దానవారిని, వారిజాక్షుడు శౌరిని వీక్షించి వినయంతో వందించి పూజించాడు. 'ప్రభూ! ఈ రూపంగా మీరు నా గృహానికి అపురూపంగా- అపూర్వంగా విజయం చేశారు' అని ఆప్యాయంగా పలికాడు.

**ఉ|| 'ఏ విభు పాదపద్మ రతులెన్నడు నెవ్వరు బొందలేని పెంద్రోవ జరింతు రట్టి బుధతోషక! నీ వరుదెంచుటం బ్రమోదా వృతమయ్యె జిత్తము గృతార్థత నొందె మనోరథంబు నీ సేవ బవిత్ర భావమును జెందె శరీరము నేడు మాధవా!'**


'పుండరీకాక్షా! పండితులను నిండుగా ప్రమోద- ఆనంద పరచువాడా! ఏ పరమేశ్వరుని పాదపద్మాల యందు సేదతీరిన వారు ఎప్పుడూ, ఎవ్వరూ పొందలేని పెంద్రోవ- గొప్ప దారిలో నడువ గలుగుతారో, అట్టి నీ మేలైన రాకతో నా డెందం- మనసు అమంద- అపరిమిత ఆనందంతో నిండిపోయింది. నా కోరిక తీరింది. నీ సేవ వల్ల నా శరీరం పావనమైంది. మహానుభావా! లోకాలన్నిటినీ అలవోకగా కప్పివేయగల మాయ నీకు అధీనమై ఉంటుంది. నీవు ఒప్పిదమై- సర్వాంగ సుందరమై విరాజిల్లు మంగళమూర్తివి. సద్బుద్ధి గలవారిని సంరక్షించడంలో సర్వదా సంసిద్ధుడవై ఉంటావు. ఘనమైన తపమే మహాధనంగా గల సన్మనస్కులకు- సజ్జనులకు నీవు సార్వభౌముడవు. ఓ వనమాలీ! అనఘా! (పాప రహితుడా!) నా పాపం, తను (దేహ) తాపం తొలగటానికి నీకు సాగిలపడి మ్రొక్కుతాను'. 'పురుషోత్తమా! నీవు పితృభక్తి పరాయణుడవు, మాయా దూరుడవు. పవిత్ర హృదయులైన భక్తులయందు ప్రేమ కలవాడవు. నా భృత్యుడు ఇంచుకైనా వివేకం లేక, నీ తండ్రి అని ఎంచక, ఈయనను నా వద్దకు తెచ్చాడు. దయతో నీ జనకుని గొనిపొమ్ము. కృపానిధీ! నా అపచారం మన్నించి నన్నూ, నా భటుణ్నీ కాపాడు' అని వేడుకుంటున్న వరుణుణ్ని కరుణించి వాసుదేవుడు, తన జనకుని తోడుకొని గోకులానికి తిరిగి వచ్చాడు.

మూలంలో వరుణుడు అశరణ శరణుని కృష్ణుని ప్రస్తుతించే ప్రసంగంలో 'పితృవత్సల!' అని మాత్రమే ఉండగా పోతన 'జనక వత్సల, నిర్మల, భక్తవత్సలా' అని విస్తరించాడు. గోపకులందరూ శ్రీకృష్ణుని సాక్షాత్ విష్ణువుగా భావించారు. 'తన ఏకాంత- అనన్య ప్రేమీ భక్తులు మాత్రమే దర్శించగల తన మాయాతీతమైన పరంధామాన్ని- బ్రహ్మమనే నామం కల స్వస్థానాన్ని మాకు కూడా చూపితే ఎంతో బాగుండు కదా!' అని ఆశపడ్డారు. సర్వజ్ఞుడైన భగవానుడు తన బంధువుల మనోభావం గ్రహించి దయతో ఇలా తలచాడు.

**ఆ|| 'ప్రకృతి కామ కర్మ పరవశమై యుచ్చ నీచ గతుల బొంది నెఱయ బ్రమసి తిరుగుచున్న జనము తెలియనేరరు నిజ గతి విశేషమీ జగంబు నందు'**

ఈ సంసారంలో జీవులు అజ్ఞానం వల్ల తమ దేహాలనే ఆత్మగా భ్రమించి బహువిధాల కోరికలతో సతమతమవుతూ, వాటిని తీర్చుకోడానికి అనేక కర్మలలో తగులుకొని, తత్ఫలంగా ఉత్తమ, అధమ (దేవ, మనుష్య, పశు పక్ష్యాది) జన్మలను పొంది భ్రాంతితో సంచరిస్తున్నారు. వాస్తవికమూ, అసాధారణమూ అయిన నా నిజస్వరూప విశేషాలను గ్రహించ లేకుండా ఉన్నారు.

**మ|| 'అని చింతించి దయాళుడైన హరి మాయాదూరమై జ్యోతియై యని రూప్యంబయి, సత్యమై యెఱుకయై, ఆనందమై బ్రహ్మమై యనఘాత్మల్ గుణ నాశమందు గను నిత్యాత్మీయ లోకంబు గ్రక్కున జూపెం గరుణార్ద్ర చిత్తుడగుచున్ గోపాలక శ్రేణికిన్'**




మన పోతన 184 మధురిమ వ భాగం

'రాజా! అలా భావించి దయా స్వరూపుడైన ఆ దామోదరుడు, మాయకు అతీతము, పరంజ్యోతీ స్వరూపము, ఇదం- ఇత్థం- ఇది, ఇట్టిది అని నిరూపించరానిది, సత్యము- త్రికాలలలో నశించనిది, జ్ఞానానంద మయ పరబ్రహ్మము, త్రిగుణ రహితులు సమాధి నిష్ఠులైన పరమ పుణ్యాత్ములు మాత్రమే దర్శించ గలిగిన తన శాశ్వతలోకాన్ని దయతో వారికి చూపించదలచాడు. పరమాత్మ, పూర్వం అక్రూరునికి తన స్వరూపాన్ని చూపించిన, యమునలోని 'బ్రహ్మహ్రదం' అనే మడుగు వద్దకు తీసుకువెళ్లాడు. నందాది గోపకులందరూ అందులో మునిగి పరంధామాన్ని దర్శించారు. పరమానందం పొందారు. వేదాలన్నీ రూపుదాల్చి యశోదానందనుని కృష్ణుని కీర్తిస్తుండగా చూచి వారు విస్మయం చెందారు. హంస స్వరూపుడైన పరమాత్ముని అవలోకించి- తిలకించి, అర్చించి పులకించారు.' పై మత్తేభ వృత్తంలో మూలశ్లోకానికి చాల విధేయమైన ఉత్తమ అనువాదం అందించి కవి సత్తముడు పోతన తన వాగ్జాలంలో భావుక భక్తుల చిత్తాలను బంధించాడు.

'ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః' (విష్ణు సహస్ర నామ స్తోత్రం)- శ్రీకృష్ణుని దేవాధి దేవత్వాన్ని నిరూపించటానికి భాగవత దశమ స్కంధంలో చతుర్ముఖ బ్రహ్మ, ఇంద్ర, వరుణుల పరాభవం ప్రస్తావించబడింది. బ్రహ్మకి, నేను సృష్టికర్తను అన్న అభిమానం. ఆయన మాయం చేసిన గోపబాలుర, దూడల రూపాలను కైటభారి కృష్ణుడు తానే ధరించి హాటకగర్భు (బ్రహ్మదేవు)ని ఆట కట్టించాడు. గోవర్ధనలీలలో 'నేను నాక (స్వర్గ) పతిని, లోకపాలుణ్ని, వర్ష అధిదేవతని' అన్న పాకశాసను (ఇంద్రు)ని అహంకారాన్ని నిరాకరించాడు. ఇప్పుడు వరుణ లోకం నుండి తన జనకుని క్షేమంగా తెచ్చుకొన్న ఈ వరుణ పరాభవ ప్రసంగం ద్వారా శ్రీకృష్ణుని రాసక్రీడకు ద్వారం తెరువబడింది. రాసలీలకు ముందుగా ముఖద్వారంగా కానవచ్చే ఈ ఘట్టం పరిమాణంలో ఊన- చిన్నదైనా మహిమలో ఘనమై మిక్కిలి మనన యోగ్యమైనది.

'వరుణుడు మన రసనేంద్రియానికి- నాలుకకు అధిపతి- ఏలిక. ఆయన దూతలు షడ్రుచులు- ఉప్పు, పులుపు, తీపి, చేదు, కారం, వగరు అనేవి. రసనేంద్రియాన్ని- జిహ్వని జయించనిదే ఎవ్వరూ రాసలీలలో ప్రవేశానికి నోచుకోలేరు. షడ్రసాల వ్యసనపరునికి వాసుదేవుని భాసురమైన రాసరసం- బ్రహ్మానందం లభించదు. నందుడు జీవులకు ప్రతినిధి. జీవుడు కృష్ణభక్తి అనే కాళింది (యమున)లో స్నానానికి దిగగానే వరుణ సేవకులైన షడ్రసాలు- ఆరు రుచులు అతనిని బంధించడానికి పూనుకొంటాయి. జీవాత్మ శబ్ద, స్పర్శాది లౌకిక- భౌతిక విషయ రసాలకు వశమై ఉన్నంతవరకు అలౌకిక- నిర్విషయమైన బ్రహ్మరసాన్ని ఆస్వాదించజాలదు. షడ్రసాలను జయించడానికి భక్తిరసాన్ని ఆశ్రయించాలి, సాధించాలి. ఈ కాలంలో మానవుని ఎక్కువ సమయం జిహ్వేంద్రియ, గుహ్యేంద్రియ (ఉపస్థ)ములను తృప్తిపరచడంతోనే- రస, స్పర్శ సుఖానుభవంతోనే గడచిపోతుంది అని డోంగ్రే మహారాజ్ ఈ లీలా పరమార్థాన్ని చాలా చక్కగా వక్కాణించారు. 'వయసిగతే కః కామ వికారః'- తిరిగి రాని యవ్వనం తరిగిపోతే మరుని- కాముని వికారమన్నా కనుమరుగై పోతుందేమో కాని రసనేంద్రియం మాత్రం అంతకంతకూ మెరుగుపడుతూ- పెచ్చరిల్లుతూ చచ్చేవరకు కచ్చ(కక్ష) కట్టి వ్యసనాన్ని- కష్టనష్టాలను కలిగిస్తూనే ఉంటుంది. 'సాధకుడు సంయమం పాటిస్తూ వివేకంతో ఆహారం స్వీకరించక ఇతర ఇంద్రియాలను శీఘ్రతరంగా తరించ- జయించ గలిగినా రసనేంద్రియం- నాలుక మాత్రం అంత తేలికగా వశం కాదు. తిండి పెట్టక మాడిస్తే దాని కండబలం పెరిగి ఇంకా చండ ప్రచండమవుతుంది. ఉద్ధవా! 'జితం సర్వం జితేరసే'- నాలుకను లొంగ తీసుకుంటే ఇంద్రియాలన్నీ వంది మాగధుల వలె వంగి-వంగి వందనాలు చేస్తాయి' అని భాగవతం ఏకాదశ స్కంధంలో ఉద్ధవునికి భగవానుని మహోపదేశం. నమోస్తు తే వ్యాస విశాల బుద్ధే!

(సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

# శరీరం విలువ

కథాసుధ



ఓ రాజు భటులతో కలిసి వేట కోసం అడవికి వెళ్లాడు. జంతువులను వేటాడుతూ రాజు దారి తప్పాడు. సూర్యాస్తమయం కావస్తున్నా.. భటులు తమ రాజును కలుసుకోలేకపోయారు. అప్పటికే రాజు బాగా అలసిపోయాడు. చీకట్లు ముసురుకుంటుండటంతో ఆయనకు విశ్రాంతి తీసుకోవాలనిపించింది. ఇంతలో ఓ సాధువు కనిపించాడు. తను విశ్రమించడానికి ఏదైనా వసతి చూపాల్సిందిగా సాధువును కోరాడు రాజు. పక్కనే ఉన్న తన చిన్న గుడిసె చూపించి, అందులో విశ్రాంతి తీసుకోమని చెప్పాడు సాధువు. ఆ మాటకు రాజుకు కోపం వచ్చింది. 'నేనెవరో తెలుసా! ఈ రాజ్యానికి రాజును. ఏనుగు చచ్చినా బతికినా వెయ్యే అన్నట్లు ఎక్కడ ఉన్నా నేను రాజునే' అన్నాడు. సాధువు నవ్వుతూ 'బొందిలో ప్రాణం ఉన్నంతవరకే ఈ శరీరానికి విలువని మరిచారు రాజా! మీరు మరి కొద్ది దూరం వెళ్లండి. ఇంకేదైనా వసతి దొరుకుతుందేమో...' అన్నాడు. చీకటి పడతుండటం, దారి తెలియక పోవడంతో సాధువును సాయం రావాల్సిందిగా కోరాడు రాజు. ఇద్దరూ నడక ప్రారంభించారు. కాసేపటికి పెద్ద గులాబీ తోట మధ్యలో ఓ రైతు ఇల్లు వారికి కనిపించింది. ఇద్దరూ వెళ్లి రైతును కలిసి పరిచయం చేసుకుని విషయం వివరించారు. రైతు వారిని లోనికి ఆహ్వానించాడు. వారికి పాలు, పండ్లు ఇచ్చాడు. అక్కడికి వంద అడుగుల దూరంలో చిన్న కొలను ఉంది. అక్కడ పడుకోవడానికి అనువైన స్థలాన్ని రాజుకు చూపాడు రైతు. అటుగా వెళ్తుంటే రాజు చెప్పులు తెగిపోయాయి. రైతే స్వయంగా వాటిని తన ఇంట్లో పెట్టించాడు. రాజు కొలను ఒడ్డున ప్రశాంతంగా నిద్రించాడు. తెల్లవారడంతోనే రాజు, సాధువు ఇద్దరూ నిద్రలేచారు. కళ్లు నులుముకుంటూ.. 'రాత్రంతా శరీరం విలువ గురించి మీరన్న మాటలే మెదిలాయి. నేను రాజును కదా, నా ప్రాణం పోయాక, ప్రజలు నన్ను పట్టించుకోరా?' అని అడిగాడు రాజు. సాధువు నవ్వి 'మీరు నాకు సహకరిస్తే ఇప్పుడే రుజువు చేస్తాను!' అన్నాడు. రాజును ప్రాణం పోయిన వాడిలా నటించమన్నాడు. రాజు అలాగే శవంలా పడుకున్నాడు. సాధువు రైతు దగ్గరికి వెళ్లి.. 'రాజు చనిపోయాడని, భటులు వచ్చేంతవరకు రాజు మృతదేహాన్ని మీ ఇంటి వరండాలో ఉంచమ'ని కోరాడు. రైతు కనికరం లేకుండా, సాధువు ముఖం మీదే తలుపు వేశాడు. 'అలా చేస్తావేం! ఎంతైనా మన రాజుగారు కదా!' అన్నాడు సాధువు. 'రాజైనా, భటుడైనా.. ఊపిరి పోయాక మిగిలేది శవమే కదా! ఎవరైనా మృతదేహాన్ని ఇంట్లో పెట్టుకుంటారా?' అని కేకలేశాడు. ఇదంతా ప్రత్యక్షంగా అనుభవించిన రాజుకు జ్ఞానోదయం అయ్యింది. తెగిన చెప్పుల కున్న విలువ కూడా ప్రాణం లేని శరీరానికి ఉండదని తెలుసుకున్నాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

ఉపనిషత్ వాక్యం

## ముగ్గురు దొంగలు

**'ప్రకృతిః త్రిగుణావలంబినీ' అంటుంది యోగసారోపనిషత్తు. అంటే ప్రకృతి త్రిగుణాలను ఆధారంగా చేసుకొని సంచరిస్తున్నదని భావం. ప్రకృతి అంటే లోకాన్ని నడిపించే మాయ. ఇదీ పరబ్రహ్మంలో ఒక భాగమే! మాయతోనే మనసు లేదా మాయే మనసు.. అనుకోవచ్చు. మనసనేది త్రిగుణాలతో కూడి ఉంటుంది. మనుషుల నడుమ వ్యవహారాలలో అనేక భేదాలు గోచరించడానికి ఇవే కారణం. సత్వరజస్తమో గుణాలే త్రిగుణాలు. వీటి నిష్పత్తులలోని భేదాలే ఒక్కొక్కరి ప్రత్యేక వ్యక్తిత్వాలు.**

ఒకసారి ఒకతను దట్టమైన అరణ్యంలో ప్రయాణిస్తున్నాడు. ఇంతలో ముగ్గురు దొంగలు అటకాయించి అతణ్ని నిలువుదోపిడీ చేశారు. ఒక దొంగ కత్తి దూసి నరకబోయాడు. మరొకడు అడ్డుకొని 'అంత పని చేయకు. వీడి కాళ్లు చేతులు కట్టి పారవేస్తే సరి. మనం పారిపోవచ్చు' అన్నాడు. అలాగే చేసి అక్కడినుంచి వెళ్లిపోయారు దొంగలు. కాసేపటికి ఇద్దరు దొంగల కళ్లుగప్పి మూడో దొంగ తాము బంధించిన బాటసారి దగ్గరికి వచ్చాడు. అతని కట్లు విప్పాడు. 'బాధ పడకు. నాతో రా!' అన్నాడు. వెంటబెట్టుకుని అడవి దాటించి అతని ఊరు వెళ్లే దారి మీద వదిలేశాడు. 'తిన్నగా వెళ్తే మీ ఊరు చేరుకుంటావు' అన్నాడు. బాటసారి అతనికి కృతజ్ఞతలు చెప్పాడు. 'మీరు ఎంతో దయామయులు. మా ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరిస్తే చాలా సంతోషిస్తాం' అని ప్రాధేయపడ్డాడు. అప్పుడు ఆ దొంగ 'అమ్మ బాబోయ్! నేను రాకూడదు. వస్తే రక్షకభటులు పట్టుకుంటారు కదా!' అన్నాడు.



రామకృష్ణ పరమహంస ఒకసారి మహేంద్రనాథ దత్తకు ఈ కథ చెప్పి 'సంసారమే మహారణ్యం. సత్వ రజ స్తమో గుణాలే ముగ్గురు దొంగలు. తమో గుణం నాశనం చేస్తుంది. రజో గుణం బంధిస్తుంది. సత్వ గుణం మాత్రం వీటన్నిటి నుంచి తప్పిస్తుంది. అయినా బ్రహ్మ జ్ఞానాన్ని కలిగించజాలదు. 'అదిగో పరబ్రహ్మం' అని దూరం నుంచి చూపించి నిష్క్రమిస్తుంది' అని వివరించాడు.

... డా.వెలుదండ సత్యనారాయణ